ట్రస్మా కుటుంబ సభ్యులే నా బలం, బలగం

- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు
- మానకొండూర్‌లో ప్రైవేట్ టీచర్స్ ఆత్మీయ సమ్మేళనం

ఆత్మీయ సమ్మేళనంలో మండల ప్రైవేట్ ఉపాధ్యాయులతో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శేఖర్‌రావు

మానకొండూర్, నవంబర్ 3: ట్రస్మా ఆధ్వర్యంలో పాతిక ఏళ్లుగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి అహర్నిషలు కృషి చేశానని, ట్రస్మా కుటుంబ సభ్యులే తన బలం, బలగం అని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు పేర్కొన్నారు. ట్రస్మా మండలాధ్యక్షుడు ఆడెపు రవీందర్ అధ్యక్షతన ఆదివారం మానకొండూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేసిన మండల ప్రయివేట్ టీచర్స్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి శేఖర్‌రావు హాజరై మాట్లాడారు. ట్రస్మా కుటుంబ సభ్యుల ఆశీర్వాదంతోనే ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో నిలిచినట్లు తెలిపారు. ఈసందర్భంగా మండల ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం, ఉపాధ్యాయులు శేఖర్‌రావును ఘనంగా సన్మానించారు. ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, కరీంనగర్ టౌన్ ప్రెసిడెంట్ నరేశ్, సభ్యులు బండ శ్రీకాంత్, సురేందర్, ఆడెపు రవీందర్, జిల్లా కోశాధికారి రంగు శ్రీనివాస్, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు శ్యాంసుందర్‌రెడ్డి, మిని విజయ, డీ శ్రీనివాస్, పరశురాములు, హకీం, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇండియన్ గ్రాండ్ మాస్టర్ అర్జున్‌కు సత్కారం

ఇండియన్ గ్రాండ్ మాస్టర్ అర్జున్, తల్లిదండ్రులను సత్కరిస్తున్న జీనియస్ చెస్ అకాడమీ నిర్వాహకులు

కొత్తపల్లి, నవంబర్ 3 : ప్రపంచ చెస్ ఒలింపియాడ్‌లలో అద్వితీయ ప్రతిభ చూపి విజయాలు సాధించిన ఇండియన్ గ్రాండ్ మాస్టర్ ఎరగైసి అర్జున్‌ను ఆదివారం వరంగల్‌లోని ఆయన నివాసంలో కరీంనగర్ జీనియస్ చెస్ అకాడమీ నిర్వాహకులు మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. భారత నంబర్‌వన్ గ్రాండ్ మాస్టర్, ప్రపంచ 3వ చదరంగం ఆటగాడిగా 2800 రేటింగ్ నమోదు చేసి తొలిసారిగా స్వగృహం వరంగల్‌కు వచ్చిన సందర్భంగా అర్జున్‌తో పాటు అతడి తల్లిదండ్రులు డాక్టర్ శ్రీనివాస్, జ్యోతిని అకాడమీ ప్రతినిధులు సన్మానించారు. చెస్‌లో భారత్‌ను ప్రపంచ నంబర్‌వన్‌గా నిలపడమే తన లక్ష్యమని, భవిష్యత్తులో మెరుగైన కోచింగ్ తీసుకొని ముందుకు వెళ్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కాగా, వరంగల్ వాసీ అయిన అర్జున్ ఇండియా నంబర్‌వన్‌గా, ప్రపంచ మూడో స్థానంలో ఉండడం మనకు గర్వకారణమని అకాడమీ నిర్వాహకులు కొనియాడారు. కార్యక్రమంలో జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకుడు కంకటి కనకయ్య, డైరెక్టర్ కంకటి అనూప్‌కుమార్, కోచ్ సృజన్‌కుమార్, అనిల్ తదితరులున్నారు.

రెడ్డి ఐక్యవేదిక మండలాధ్యక్షుడిగా కాటం సంపత్ రెడ్డి

చిగురుమామిడి, నవంబర్ 3: రెడ్డి ఐక్యవేదిక మండలాధ్యక్షుడిగా లంబాడి పల్లి గ్రామానికి చెందిన కాటం సంపత్ రెడ్డి రెండో సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో గౌరవాధ్యక్షుడిగా వంటకాల సంపత్ రెడ్డి (రామంచ), ఉపాధ్యక్షులుగా సంధి రాజిరెడ్డి (సీతారాంపూర్), వర్ణ కొండారెడ్డి (రేకొండ), ప్రధాన కార్యదర్శిగా కేతిరెడ్డి కొండల్ రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గా కాంతాల మైపాల్ రెడ్డి, సహాయ కార్యదర్శులుగా యాల్ల జనార్దన్ రెడ్డి, సింగిరెడ్డి రాజిరెడ్డి, ఐక్యవేదిక యూత్ మండలాధ్యక్షుడిగా సీతారాంపూర్ గ్రామానికి చెందిన చామకూర చంద్రశేఖర్ రెడ్డిని ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ, రెడ్డి కులస్తుల సమస్యల పరిష్కారం కోసం తమ వంతు కృషి చేస్తామన్నారు. తమ ఎన్నికకు సహకరించిన జిల్లా నాయకులు పన్యాల శ్యామ్ సుందర్ రెడ్డి, పోటు మల్లారెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా అజయ్

కొప్పుల అజయ్‌కుమార్

విద్యానగర్, నవంబర్ 3: మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా కరీంనగర్‌కు చెందిన కొప్పుల అజయ్ కుమార్‌ను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య పటేల్ ఆదివారం నియామక పత్రాన్ని జారీ చేశారు. రాష్ట్రంలో మున్నూరుకాపుల బలోపేతం కోసం కృషి చేయాలని కోరారు. కాగా, సంఘ బలోపేతం కోసం తన శాయశక్తులా కృషి చేస్తానని అజయ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

రెడ్డి సంఘం నూతన కమిటీ

రామడుగు, నవంబర్ 3 : కొక్కెరకుంటలో ఆదివారం రెడ్డి సంఘం నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా పబ్బతి అంజిరెడ్డి, కార్యదర్శిగా బోళ్ల రాజశేఖర్‌రెడ్డి, కోశాధికారిగా బోళ్ల వినయ్‌రెడ్డి, సలహా సంఘం సభ్యులుగా పబ్బతి ప్రశాంత్‌రెడ్డి, తౌటు సాగర్‌రెడ్డి, బోళ్ల పవన్‌రెడ్డి, అల్లకొండ వేణురెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డిసంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగం పొందిన యువకుడికి ఘనసన్మానం

రామడుగు, నవంబర్ 3 : గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన దాసరి ఆనంద్ అనే ఇటీవల డీఎస్సీలో ఎస్‌జీటీగా ఉద్యోగాన్ని సాధించగా, గ్రామానికి చెందిన హెల్పింగ్‌హ్యాండ్స్ ఆదర్శబంధం ఫ్యామిలీ మెంబర్స్ ఆధ్వర్యంలో ఆదివారం శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు దాసరి మల్లేశం, చంద్రయ్య, శ్రీనివాస్, శంకరయ్య, వేల్పుల హరికృష్ణ, కనకయ్య, అంజయ్య, వెంకటేశ్, శ్రీనివాస్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

కమాన్‌చౌరస్తా, నవంబర్ 3 : జిల్లా కేంద్రంలోని చైతన్యపురిలో నలుమాచు మనోహర్ రాధ ఆధ్వర్యంలో 101 ఆర్యవైశ్య జంటలతో సామూహిక సత్యనారాయణ వ్రత కార్యక్రమాన్ని తొగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి పనిలో మనసు లగ్నం చేస్తూ, భగవంతుడిని స్మరించుకుంటే నిజమైన ఆనందం దొరుకుతుందన్నారు. ఈ వ్రత కార్యక్రమాన్ని ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు రమేశ్ శర్మ, భూశంకర్ శర్మ వైదిక నిర్వహణలో నిర్వహించగా, హరి శంకర్ శర్మ, విఠల్ శర్మ, నాగన్న శర్మ తదితర వేద పండితులు పాల్గొన్నారు.

యోగా కుసుమం.. ప్రతిభ అసమాన్యం

- జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించిన జిల్లా క్రీడాకారుడు
- రాష్ట్ర చరిత్రలో మొదటిసారి గోల్డ్ మెడల్‌తో రికార్డు

యోగాసనం వేస్తున్న పురాణం దీపక్

కేవలం పదమూడేళ్ల వయసులో అసమాన్య ప్రతిభతో జాతీయ యోగా పోటీల్లో మెరిసి సత్తా చాటాడు జిల్లాకు చెందిన విద్యార్థి. శరీరాన్ని విల్లులా వంచుతూ.. అలవోకగా ఆసనాలు వేస్తూ బంగారు పతకం కైవసం చేసుకొని జిల్లాకు జాతీయ స్థాయిలో ఖ్యాతి తీసుకువచ్చాడు. ఇక అంతర్జాతీయ పోటీలే లక్ష్యంగా కసరత్తు చేస్తూ యోగా క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తున్నాడు.

-కొత్తపల్లి, నవంబర్ 3

జిల్లాలోని మానకొండూర్ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పురాణం దీపక్ చిన్ననాటి నుంచే యోగాపై ఆసక్తి పెంచుకున్నాడు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం నారాయణరావు పల్లికి చెందిన అతడు.. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో యోగా కోచ్ రామకృష్ణ వద్ద శిక్షణ పొందుతున్నాడు. పట్టుదలతో నిరంతర సాధన చేస్తూ రాష్ట్రస్థాయిలో అనేక పతకాలు సాధించాడు. ఇటీవల యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హిమాచల్‌ప్రదేశ్‌లోని యునాలో జరిగిన జాతీయ యోగా స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని అద్భుత ప్రతిభ చూపి రాష్ట్రచరిత్రలో మొట్టమొదటిసారిగా గోల్డ్ మెడల్ సాధించి రికార్డు సృష్టించాడు. సబ్ జూనియర్ విభాగం (అండర్ 12-14)లో పోటీ పడ్డ దీపక్ మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకొని ప్రముఖుల ప్రశంసలు అందుకున్నాడు.

దేశానికి పేరు తీసుకురావడం నా కల

కోచ్ రామకృష్ణతో దీపక్

జాతీయస్థాయి యోగా పోటీల్లో బంగారు పతకం సాధించడం గర్వంగా ఉంది. జాతీయ యోగా పోటీల్లో సబ్ జూనియర్ విభాగంలో రాష్ట్ర చరిత్రలో మొట్టమొదటిసారిగా నేను బంగారు పతకం సాధించడం జీవితంలో మరిచిపోలేనిది. 2022లో సిరిసిల్లలో జరిగిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించా. అలాగే 2023లో అస్సాంలో జరిగిన జాతీయ యోగా పోటీల్లో 5వ స్థానం సాధించా. రాబోయే అంతర్జాతీయ యోగా పోటీల్లో పతకం సాధించి రాష్ట్రంతో పాటు దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావడం నా కల. ఇందు కోసం మరింత కష్టపడుతా.

- పురాణం దీపక్, జాతీయ యోగా క్రీడాకారుడు

ఇప్పటివరకు ఏ జిల్లాకు ఇలాంటి ఖ్యాతి దక్కలేదు

రాష్ట్రస్థాయి యోగా చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు రాణిస్తున్నారు. 15 సంవత్సరాలుగా ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు ఏ జిల్లాకు ఇలాంటి ఖ్యాతి దక్కలేదు. సబ్ జూనియర్ విభాగంలో జిల్లాకు చెందిన క్రీడాకారుడు దీపక్ మొదటిసారి జాతీయ పోటీల్లో బంగారు పతకం సాధించి రికార్డు సృష్టించాడు. యోగాలో రాణించే క్రీడాకారులకు ఉన్నత విద్యలో రిజర్వేషన్ కల్పిస్తున్న ప్రభుత్వం, ఉద్యోగాల్లోనూ రిజర్వేషన్ వర్తింప చేస్తే మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశం ఉంది.

-నాగిరెడ్డి సిద్ధారెడ్డి, జిల్లా యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి

ఎంఐఎం జపంతోనే సంజయ్‌కి మనుగడ

- స్థానిక సంస్థల బరిలో మా అభ్యర్థులు
- పార్టీ నగర అధ్యక్షుడు గులాం అహ్మద్

కలెక్టరేట్, నవంబర్ 3 : మతం పేర ప్రజలను మభ్యపెడుతున్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, నిత్యం ఎంఐఎం జపం చేయడంతోనే మనుగడ సాగిస్తున్నారని మజ్లిస్ పార్టీ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ విమర్శించారు. ఆదివారం నగరంలోని ఆయన నివాసంలో ఆపార్టీ ముఖ్యకార్యకర్తల సమ్మేళనం జరిగింది. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, కేంద్రంలో సహాయమంత్రిగా కొనసాగుతున్న కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు బండి సంజయ్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రెండోసారి ఎంపీగా గెలిచి ఆరునెలలు గడుస్తున్నా ఇప్పటివరకు నయాపైసా కూడా కరీంనగర్ అభివృద్ధికి మంజూరు చేయించలేదని విమర్శించారు. తన వ్యక్తిగత ఇమేజ్ పెంచుకునేందుకు ఎంఐఎం పార్టీపై అవాకులు, చవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. ఇకనైనా మత రాజకీయాలు వీడి కరీంనగర్ సెగ్మెంట్ అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు. తనకు ఓట్లేసి గెలిపించిన ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, వారి అభివృద్ధికి సహకరించాలని సూచించారు. రాబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తమ పార్టీ అభ్యర్థులను బరిలోకి దించబోతున్నట్లు ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలను కలుపుకొని ఈసారి తమ సత్తా చాటబోతున్నట్లు వెల్లడించారు. పోటీ చేసే ఆసక్తి ఉన్న పార్టీ కార్యకర్తలు, ఆశావహులు ఎంఐఎం బాధ్యులను సంప్రదించాలని సూచించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో నగరంలో 25 సీట్లలో పోటీచేసేందుకు కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. కనీసం 20 సీట్లలోనైనా కచ్చితంగా గెలుస్తామనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈసారి మేయర్, డిప్యూటీ మేయర్ పదవులు చేజిక్కించుకునేందుకు పక్కా వ్యూహాన్ని సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎంఐఎం నాయకులు అబ్బాస్‌షమీ, యూసుఫ్ నదీమ్, అబ్దుల్ రఫీ, అక్రమ్, ఇమ్రాన్ అలీ, మీర్‌జాకీర్, ముస్తాఫా, బర్కత్ అలీ, హఫీజ్ సయ్యద్ మొయిజుద్దిన్ ఖాద్రీ, ఖమ్రుద్దిన్, అతిన, ఇబ్రహీం, అఖిల్ ఫిరోజ్, శర్ఫుద్దిన్, అలీబాబా, అజర్ దబీర్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆపార్టీ ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రాంతీయ క్రీడా పాఠశాలలో ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న శాట్స్ చైర్మన్

కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాలను అప్‌గ్రేడ్ చేస్తాం

- తెలంగాణలోనే కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్ నంబర్ వన్‌గా నిలువాలి
- శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి

కొత్తపల్లి, నవంబర్ 3: కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలను వచ్చే సంవత్సరం నాటికి ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేస్తానని, పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఎక్కడికి వెళ్లకుండా ఇక్కడే ఉండి క్రీడల్లో రాణించి దేశానికి పతకాలు అందించే క్రీడాకారులుగా తయారు కావాలని శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి సూచించారు. కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలను ఆదివారం రాత్రి ఆయన ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల తరగతి గదులు, గ్రంథాలయం గదిని పరిశీలించారు. అనంతరం బాక్సింగ్, జూడో, స్విమ్మింగ్ పూల్, సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్, విద్యార్థుల హాస్టల్ గదులను పరిశీలించారు. విద్యార్థులు ఆయా క్రీడల్లో తీసుకుంటున్న శిక్షణ గురించి కోచ్‌లను అడిగి తెలుసుకున్నారు. ఎలా శిక్షణ పొందుతున్నారో నేరుగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయా క్రీడలకు సంబంధించి ఇంకేమైనా కావాలా అంటూ విద్యార్థులను అడిగారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. క్రీడల్లో రాణించిన వారు గొప్ప స్టార్‌లు ఎదుగుతారన్నారు. ప్రతి ఒక్కరూ ఒలింపిక్ స్థాయికి ఎదిగేలా లక్ష్యం పెట్టుకోవాలని సూచించారు. పారా ఒలింపిక్స్‌లో దీప్తి చూపిన ప్రతిభను ఆయన విద్యార్థులకు వివరించారు. హకీంపేట స్కూల్ తరహా అన్ని సౌకర్యాలు కల్పిస్తానని, వాటిని సద్వినియోగం చేసుకొని క్రీడల్లో గొప్పగా రాణించాలన్నారు. సీఎంకప్ పోటీల్లో అద్భుతమైన ప్రదర్శన చూపాలన్నారు. విద్యార్థులు వ్యక్తిగత క్రీడాంశాలతో పాటు టీం గేమ్‌లలో సైతం రాణించేలా తీర్చిదిద్దాలని కోచ్‌లకు సూచించారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో వి. శ్రీనివాస్‌గౌడ్, కోచ్‌లు పవన్, సాయిరాం, శ్యామ్, చందు, సంపత్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జాప శ్రావణ్‌రెడ్డి, కిమ్ ఫహాద్, గట్టు ప్రశాంత్, ఆకుల ఉదయ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

'క' చిత్ర యూనిట్ సందడి

కేక్ కట్ చేసి అభిమానులకు తినిపిస్తున్న కిరణ్ అబ్బవరం

కమాన్‌చౌరస్తా, నవంబర్ 3 : జిల్లా కేంద్రంలో 'క' చిత్ర యూనిట్ సభ్యులు సందడి చేశారు. ఆదివారం ఉదయం జిల్లా కేంద్రానికి చేరుకున్న హీరో కిరణ్ అబ్బవరంతో పాటు, యూనిట్ సభ్యులు కొండగట్టుకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జిల్లా కేంద్రంలోని రాజా థియేటర్‌కు చేరుకుని అభిమానులతో మాట్లాడారు. థియేటర్ యాజమాన్యం ఆధ్వర్యంలో కేట్ కట్ చేశారు. ఇక్కడ అభిమాన సంఘం నాయకులు కార్తీక్ సురగి, ఒడ్నాల సందీప్, సురగోని కౌశిక్, గూటం సాయిరాం, గూటం నవీన్ రెడ్డి పాల్గొన్నారు.

చైతన్య రథం ప్రారంభం

కమాన్‌చౌరస్తా, నవంబర్ 3 : రైతులు, విద్యార్థులు, యువతకు సహజ యోగ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు మాతాజీ నిర్మలాదేవి ఆధ్వర్యంలో చైతన్య రథాన్ని రాష్ట్ర కోఆర్డినేటర్ గౌరీ కృష్ణ జిల్లా కేంద్రంలోని జ్యోతినగర్‌లో ప్రారంభించారు. ఈ రథం ప్రతి రోజూ మండల కేంద్రాలు, గ్రామాల్లో తిరిగి సహజ యోగా గురించి విస్తృతంగా ప్రచారం చేస్తుందని చెప్పారు. చైతన్య రథం డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ సీహెచ్ శ్రీనివాస్ రెడ్డి, సాహజ యోగా కమిటీ సభ్యులు సుప్రజ, వినోద్, వినయ్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

నేడు కొనుగోలు కేంద్రం ప్రారంభం

కరీంనగర్ రూరల్, నవంబర్ 3: చామనపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రారంభిస్తారని ఏపీఎం భార్గవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జరిగే కార్యక్రమానికి రైతులు హాజరుకావాలని కోరారు.

యువకులపై దాడి: కేసు నమోదు

రాంనగర్, నవంబర్ 3: నగరంలోని కమాన్ ప్రాంతంలో శనివారం రాత్రి ఇంటికి వెళ్తున్న ఇద్దరు యువకులను అడ్డగించి దాడి చేసిన ఘటనపై వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. బోయవాడకు చెందిన రఘుకుమార్ అతడి స్నేహితుడు సంపత్ కలిసి కమాన్ వైపు వెళ్తుండగా, కమాన్ ప్రాంతానికి చెందిన సాత్విక్, అతడి సోదరుడు, తండ్రి రాజేశం ముగ్గురూ ఇంత రాత్రి వరకు ఎందుకు తిరుగుతున్నారని అడ్డగించి కట్టెలు, రాళ్లతో దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటనలో రఘుకుమార్, సంపత్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108 అంబులెన్స్‌లో దవాఖానకు తరలించారు. చికిత్స అనంతరం రఘుకుమార్ ఫిర్యాదు మేరకు నిందితులు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ బిల్లా కోటేశ్వర్ తెలిపారు.

బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడి మృతికి నివాళి

వీరేశం భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్

మానకొండూర్ రూరల్, నవంబర్ 3: అన్నారం బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు పడకంటి వీరేశం శనివారం అనారోగ్యంతో మృతి చెందగా, భౌతిక కాయాన్ని ఆదివారం మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అంత్యక్రియల్లో సైతం పాల్గొన్నారు. వీరేశం మృతి పార్టీకి తీరని లోటని జీవీ రామకృష్ణారావు అన్నారు. వీరేశం కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇక్కడ మండలాధ్యక్షుడు తాళ్లపల్లి శేఖర్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ నల్ల గోవింద రెడ్డి, మాజీ సర్పంచ్ రామంచ గోపాల్ రెడ్డి, నాయకులు ఉండింటి శ్యాంసన్, పిట్టల మధు, బోడ రాజశేఖర్, పురం అనిల్ కుమార్, రాచర్ల రామస్వామి, ఆరెల్లి గోపాల్, తదితరులు ఉన్నారు.

ఖాదీ వస్త్రాల కొనుగోలుపై ప్రత్యేక తగ్గింపు

హౌసింగ్‌బోర్డుకాలనీ, నవంబర్ 3: కరీంనగర్‌లోని కమాన్ నుంచి రూరల్ పోలీస్ స్టేషన్ రోడ్డులో గల మెట్‌పల్లి ఖాదీ భవన్‌లో ఈ నెల 16 వరకు వరకు ఖాదీ వస్త్రాలు 40శాతం ప్రత్యేక తగ్గింపు ధరకు లభిస్తాయని సంస్థ చైర్మన్ కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, ఖాదీ భవన్ మేనేజర్ వీ భిక్షపతి ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఖాదీ వస్త్రాలు కొనుగోలు చేసి, నేత కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న ఖాదీ గ్రామీణ పరిశ్రమలను ప్రోత్సహించాలని కోరారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదు గడువు పొడిగించాలి

కలెక్టరేట్, నవంబర్ 3 : కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ పట్టభద్రుల శాసనమండలి ఓటరు నమోదు గడువు పొడిగించాలని తెలంగాణ గ్రాడ్యుయేట్స్, అన్‌ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఓంప్రసాద్ డిమాండ్ కోరారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి ఈమెయిల్ ద్వారా వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. ఓటరు నమోదు గడువు ఈనెల 6తో ముగియనున్నదని, ఇప్పటివరకు నియోజకవర్గ పరిధిలో ఓటర్ల నమోదు సంఖ్య కనీసం 2 లక్షలు కూడా దాటలేదని పేర్కొన్నారు. ఓటరు నమోదు కోసం ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన నాటి నుంచి నేటి వరకు వచ్చిన దరఖాస్తుల పరిశీలనలో తీవ్ర జాప్యం నెలకొందని, దీంతో వేలాది మందికి ఇప్పటివరకు క్లియరెన్స్ మెస్సేజ్‌లు రాలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆధార్‌కార్డుల్లో చిరునామా ఓచోట, ఉద్యోగాలు, వృత్తి, వ్యాపారాలతో ఇతర ప్రాంతాల్లో నివసిస్తుండగా వారు దరఖాస్తు చేసుకున్నా, ఆమోదించడం లేదని తెలిపారు. డిసెంబర్ 31 వరకు దరఖాస్తుల ప్రక్రియ కొనసాగించాలని, ఓటరు నమోదు కోసం అవగాహన కార్యక్రమాలు కూడా విస్తృతం చేయాలని ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ప్రజా సంఘాల సమన్వయ కమిటీ కార్యవర్గం

కొప్పుల శంకర్, మండల కన్వీనర్

హుజూరాబాద్ టౌన్, నవంబర్ 3: ప్రజా సంఘాల సమన్వయ కమిటీ మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం పట్టణంలో ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి వాసుదేవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. హుజూరాబాద్ మండల కన్వీనర్‌గా కొప్పుల శంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. కమిటీ సభ్యులుగా కదిరే రమేశ్, ఎండీ అజ్జు, తొర్రి కొమురెల్లి మల్లు, మధు నక్క, కొంకట చంద్రయ్య, ప్రతాప శ్రీనివాస్, రాచపల్లి సారయ్య, బోరగాల కుమార్, ఇమ్మడి శ్రీకాంత్, మోరె స్వామి, మరో ఇద్దరు కో ఆప్షన్ సభ్యులు ఎన్నికయ్యారని తెలిపారు. కాగా, తనపై నమ్మకంతో మండల కన్వీనర్‌గా ఎన్నుకున్న ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలకు కొప్పుల శంకర్ కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేసేంతవరకు ఉద్యమాలు, పోరాటాలు నిర్వహిస్తామన్నారు. అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్రూంలు ఇచ్చేంతవరకు పోరాడుతామని ఆయన తెలిపారు.

స్నేహితుల ఔదార్యం

వీణవంక, నవంబర్ 3: తమతో కలిసి చదువుకున్న తోటి స్నేహితుడు మృతిచెందడంతో అతడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు వీణవంక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు. 1999-20 సంవత్సరంలో వారితో కలిసి పదో తరగతి చదివిన పోతుల బాపూరావు ఇటీవల మృతిచెందగా, పది రోజుల క్రితం గెట్ టు గెదర్ నిర్వహించుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం రెడ్డిపల్లిలోని అతడి ఇంటికి వెళ్లి రూ.10 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో వీణవంక మాజీ సర్పంచ్ నీల కుమారస్వామి, ఉయ్యాల రాజు, గెల్లు కుమార్, సమ్మన్న, మహ్మద్ అమర్, మోటం శ్రీనివాస్, మహ్మద్ ఖాజా, పిట్టల సురేశ్, కళ్యాణం రాజు, ఎం.శ్రీనివాస్, కోమల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

కమాన్‌చౌరస్తా, నవంబర్ 3 : జిల్లా కేంద్రంలోని కట్టరాంపూర్ గిద్దె పెరుమాండ్ల స్వామి దేవస్థానంలో ఆదివారం నూతన ధ్వజస్తంభాన్ని తొగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి, వేద పండితుడు పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కరీంనగర్ ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్ సుప్రియ, ఈఈ రాజేశ్, ఇన్‌స్పెక్ట